క్లుప్తంగా

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భక్తుల పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసన



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన చేస్తున్న దృశ్యం

భీమవరం: ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తక్షణం వెనక్కి తీసుకోవాలని అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ అన్నారు. శుక్రవారం సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ భీమవరం అంబేడ్కర్ సెంటర్లో నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ మాదిగ, మాలలను విడగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల సంఘాలు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేసి రాజు, ఈది రవికుమార్, మత్తే రాజ్‌కుమార్, గంటా సుందర్‌కుమార్, గాతల సందీప్, మీసాల జయరాజ్, తాళ్లూరి రాజ్‌కుమార్, రజింత్ కుమార్, గాంధీ, కొండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

19న భీమవరంలో నూతన నటీనటుల కోసం ఎంపికలు



వివరాలను వెల్లడిస్తున్న రత్నకుమార్

భీమవరం: పట్టణంలో శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న చిత్రానికి నూతన నటీనటుల కోసం ఈనెల 19వ తేదిన భీమవరంలో అడిషన్స్ నిర్వహిస్తున్నట్లు చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బండి రత్నకుమార్ చెప్పారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దిల్ రాజు, శిరీష్ నిర్మాణంలో కోలా రవికిరణ్ దర్శకత్వంలో విజయ్‌దేవరకొండ హీరోగా నూతన చిత్రం ఏప్రిల్‌లో గోదావరి జిల్లాలో షూటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రం హీరో, హీరోయిన్స్ మినహా మిగిలిన నటీనటులను గోదావరి జిల్లాల నుంచి ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. భీమవరం పట్టణంలోని హోటల్ లీలాకృష్ణలో సినిమా అడిషన్స్ జరుగుతాయని ఆసక్తి కలిగిన నటీనటులు పాల్గొవచ్చొన్నారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి సర్కార్



ముదునూరిని ప్రసాదరాజును సత్కరిస్తున్న కోడే విజయలక్ష్మి, నాయకులు

నరసాపురం: అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన కోడే విజయలక్ష్మి శుక్రవారం నరసాపురం పార్టీ కార్యాలయంలో ముదునూరిని మర్యాదపూర్వకంగాకలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీ మహిళా విభాగం ప్రస్తుతం అత్యంత కీలకమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లపాటు రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేశారన్నారు. నేడు ఒక్క సంక్షేమ పథకం కూడా అమల్లో లేకుండా పోయిందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పని చేయాలని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కూటమి సర్కార్ మోసాలను ప్రజలు గ్రహించారని చెప్పారు. కూటమి సర్కార్ ఏడు నెలల పాలన ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, పాలా రాంబాబు, కడలి రాంబాబు, కాంగ్రేకుల శ్రీనివాస్, డీవీడీ ప్రసాద్, గాదిరాజు రామరాజు, పేరిచర్ల సత్యనారాణరాజు, ఇంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనామీ రొయ్యల పెంపకానికి సన్నాహాలు

ఆశాజనకంగా రొయ్య ధరలు



గొల్లవానితిప్పలో రొయ్య పిల్లలను లెక్కిస్తున్న దృశ్యం



మార్కెట్ తరలిస్తున్న వనామి రొయ్యలు దృశ్యం

భీమవరం అర్బన్: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో వనామీ రొయ్యల పెంపకానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో మొదటి పంటగా ఈ సాగుకు గత కొన్నేళ్లుగా పెట్టుబడులు పోను కొంత మొత్తంలో మిగలడంతో భారీ ఆశలతో పెంపకానికి శ్రీకారం చుడుతున్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తోకతిప్ప, దెయ్యాలతిప్ప, లోసరి, నాగిడిపాలెం, అనాకోడేరు, కొమరాడ, ఎల్‌వీఎన్‌పురం తదితర గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో వనామీ పెంపకం చేస్తున్నారు. గత ఆరు నెలలు చలి తీవ్రత, వర్షాలకు చెరువులో నీటి ప్రమాణాల్లో హెచ్చు తగ్గులు ఏర్పడటం, నీరు చల్లదనం ఉండటంతో రొయ్యలకు వైరస్ ప్రబలి మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో రైతులు వనామీ పెంపకానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో రొయ్యల చెరువులను ఎండగట్టడం, సున్నం, జిప్సం, జింక్ తదితర ఎరువులు కొట్టి రొయ్య పెంపకం సాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో రొయ్య ధరలు

గతేడాది జూన్, జులై నెలల్లో పట్టుబడికి వచ్చిన రొయ్యలకు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాకాలం, శీతాకాలంలో రొయ్య రైతులు తమ చెరువుల్లోని రొయ్యలు వేయడంతో చలి గాలులకు వైట్ స్పాట్, విబ్రియో, ఈహెచ్‌పీ, వైట్ గట్ వ్యాధుల కారణంగా సీడ్ వేసిన నెలలోనే రొయ్యలు మృతి చెందడంతో పట్టుబడికి వచ్చిన రొయ్యలు మండలంలో 20 శాతం లేకపోవడం, ఇతర దేశాలైన అమెరికా, చైనా తదితర దేశాలలో రొయ్యల కొరత ఏర్పడంతో రొయ్యల ధరలు భారిగా పెరిగాయి. గత మూడేళ్లుగా ఈక్విడార్ దేశంలో అత్యధికంగా రొయ్యలు పెంపకం సాగించడంతో తక్కువ ధరలకు రొయ్యలు అమెరికా, చైనా, ఇతర యూరోపియన్ దేశాలకు ఉత్పత్తి చేయడంతో ఆ ప్రభావం మన ఆంధ్రప్రదేశ్‌పై పడేది. ఈ ఏడాది భారీ వర్షాలు కారణంగా అక్కడ సాగు పెంపకం దెబ్బతినడంతో ఈ ఏడాది రొయ్య ధరలు నిలకడగా ఉంటాయని పలువురు రొయ్య వ్యాపారస్తులు చెబుతున్నారు.

ప్రస్తుత రొయ్య ధరలు ఇలా ఉన్నాయి.

29 కౌంట్ రూ. 440, 40 కౌంట్ రూ.425, 45 కౌంట్ రూ.490, 50 కౌంట్ రూ.385, 60 కౌంట్ రూ.355, 70 కౌంట్ రూ.310, 80 కౌంట్ రూ.285, 90 కౌంట్ రూ.270, 100 కౌంట్ రూ.240 ఉన్నాయి.

గత వర్షాకాలంలో తీవ్రంగా నష్టపోయాం

గత ఏడాది వర్షాకాలంలో అధిక వర్షాలు, నవంబర్, డిసెంబర్ నెలల్లో తుఫాన్‌లు కారణంగా చెరువుల్లో రొయ్యలను వేసి తీవ్రంగా నష్టపోయాం. చెరువులో వేసిన నెలలోపే రొయ్యలు మృత్యువాత చెందాయి. ఈ ఏడాది మొదటి క్రాప్‌లోనైనా వాతావరణ సహకరిస్తే బాగుంటుంది.

రేవు గోవిందరాజు, రొయ్య రైతు, దొంగపిండి

నాణ్యమైన సీడ్‌ను అందించాలి

ఎక్కడిబడితే అక్కడ రొయ్య పిల్ల హేచరీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఏది నాణ్యమైన సీడో రైతులకు అర్థం కాని పరిస్థితి. హేచరీ యజమానులు లక్షకు 50 శాతం, 1+1 ఆఫర్‌లు ఇవ్వడంతో రొయ్య రైతులు మోసపోతున్నారు. ప్రభుత్వం కల్పించుకుని నాణ్యమైన హేచరీల ద్వారా సీడ్‌ను రైతులకు అందజేస్తే రొయ్య రైతు నిలబడ గలుగుతాడు.

పెనుమాల నరసింహస్వామి, రొయ్య రైతు, గొల్లవానితిప్ప

పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం



మాట్లాతున్న వాసుదేవరావు

భీమవరం: పట్టణంలోని గణపతిరాజు నగర్‌లో పేదల ఇళ్లను తొలగించాలని చూడడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడు బి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం సీపీఎం బృందం గణపతిరాజునగర్‌లోని పేదల ఇళ్లను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత 60 ఏళ్లగా 30 కుటుంబాల పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, కాయ కష్టం చేసుకోవడం తప్ప మరొక ఆదాయం లేని నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి స్వలాభం కోసం పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇళ్లు తొలగించాలని హెచ్చరికలు జారీ చేసి రెడ్ మార్కులు పెట్టడం దారుణమన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని పేదల ఇళ్లకు రక్షణ కల్పించాలని వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి త్రిమూర్తులు, ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఆకివీడు: బాల్యం నుండే అభివృద్ధి మైలు రాళ్ల ఏర్పడాలని సీడీపీఓ ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణి విజయరత్నం పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో రెండో రోజు పోషణ్ భీ-పడాయ్ భీపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి గర్భంలో ఉన్న శిశువుకు పోషకాహారం అందజేయడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తుందన్నారు. తల్లి జీవిత చక్రంలోని దశల గురించి, లోపాలు పోషణకు కారణాలు, సూక్ష్మ పోషకలోపాలు, నివారణపై కార్యకర్తలకు వివరించారు. పిల్లల్లో శారీరక అభివృద్ధితో పాటు, మానసిక, సాంఘికాభివృద్ధి, గణితాభివృద్ధి, సౌందర్యాభివృద్ధి గురించి వివరించారు. పాఠశాలల్లోని ప్రొజెక్టర్ల ద్వారా దృశ్య, శ్రవణవిధానంలో శిక్షణ ఇచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల్లోని 261 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను 4 విభాగాలుగా విభజించి, ఆయా మండలాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారంతో శిక్షణ ముగుస్తుందని చెప్పారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ..పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పి.బేబీ వెంకటలక్ష్మి సరోజినీ, డి.గీతలు మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న జిల్లా రవాణశాఖ అధికారి ఉమామహేశ్వరరావు

భీమవరం అర్బన్: రక్తదానం చేసి ప్రతి ఒక్కరు ప్రాణదాతలు కావాలని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శివరామభద్రిరాజు అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో జిల్లా రెడ్‌క్రాస్ బ్లడ్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ. నారాయణ ఆదేశాల మేరకు శుక్రవారం ఆకివీడు, కాళ్ళ, ఉండి మండలాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరామభద్రిరాజు మాట్లాడుతూ రాయలంలో ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ బ్లడ్ సొసైటీ సంస్థ నూతన భవనంలో అత్యంత ఆధునికమైన పరికరాలతో నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖ నుంచి ఎక్కువ మంది రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. రక్తం దానం చేసిన ఆకివీడు మండల విద్యాశాఖాధికారి వి. సీతారామయ్య, ఎల్ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు (అంధ మహిళ) రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. మండల విద్యాశాఖాధికారులు రవీంద్ర, వి. సీతారామయ్య, బి.జ్యోతిలకు చైర్మన్ డాక్టర్ శివరామ భద్రిరాజు సర్టిఫికేట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజిమెంట్ కమిటీ ట్రెజరర్ కేబీ తిరుపతిరాజు, కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు లైఫ్ మెంబర్ జీ కృష్ణారావు, బ్లడ్ బ్యాంక్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

భీమవరం(ప్రకాశం చౌక్): రక్తదానం చేసి ప్రతి ఒక్కరు ప్రాణదాతలు కావాలని భీమవరం జిల్లా రవాణశాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆర్టీసీ కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేసి మరొకరి ప్రాణం కాపాడటం ఎంతో గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటరమణ, కె. ఎస్.ఎన్. ప్రసాద్, ఎస్.ఎల్ సుబ్బలక్ష్మి, ఎస్.వి.వి సత్యనారాయణ, పి.తేజ తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుతోనే చదువుపై ఏకాగ్రత

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



విద్యార్థినికి కళ్లజోడు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి

భీమవరం అర్బన్: మెరుగైన కంటి చూపుతోనే చదువుపై ఏకాగ్రత సాధ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలంలో చినఅమిరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దృష్టి లోపం కలిగిన 38 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను జిల్లా కలెక్టర్ నాగరాణి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరైన కంటిచూపుతోనే ఏకాగ్రత ఉంటుందని, లేకపోతే చదువులో విద్యార్థులు రాణించలేరన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు, ఆహారంలో ఆకుకూరలు తప్పకుండా తీసుకునేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ చూడటం తగ్గించడంతో పాటు ఆకు కూరలు, బొప్పాయి తరచూ తినాలన్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని వాటి వలన నష్టం చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్ నెస్ (ఎన్‌పీసీబీ) కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందస్తు కంటి పరీక్షలు నిర్వహించి అంధత్వ నిరోధకానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 14 మండలాల్లోని 212 పాఠశాలల్లో 35 వేల 332 మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ. నారాయణ, ఎస్ఎస్ఏ పీవో పీవై శ్యామ్ సుందర్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భాను నాయక్, డాక్టర్ చందన ప్రియాంక, ప్రధానోపాధ్యాయురాలు వేగేశ్న అనురాధ, ఎంఈవోలు ఎన్ శ్రీనివాసరావు, వి. వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ సంజీవరెడ్డి, మెడికల్ అధికారి డాక్టర్ అరుణ్, ఆప్తాలమిస్ట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనుల నిలిపివేత



కోలమూరులో పనులను నిలిపివేస్తున్న అధికారులు

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన చెరువు రిపేర్ పనులను శుక్రవారం అధికారులు అడ్డుకున్నట్లు ఎఫ్‌డీఓ రాంబాబు తెలిపారు. గ్రామంలోని ఓఎన్‌జీసీ రోడ్డును ఆనుకుని అల్లూరి శ్రీనివాసరాజు, పీత వెంకట్రావు అనే రైతుల చేపట్టిన చెరువు రిపేరు పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో వాటిని రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని వాటిని నిలిపేశామని ఎఫ్‌డీఓ తెలిపారు. అలాగే మండంలోని అందరూ ఆక్వారైతులు తమ చెరువుల గట్లు రోడ్లు, కాలువ గట్లు, పంట బోదెలను ఆనుకుని లేకుండా నిబంధనల ప్రకారం మూడు గజాలు విడిచిపెట్టి సీఫేజ్ బోదెలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఓ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



2కే వాక్ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ, డీఎన్నార్ వాకర్స్, కాఫీ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 2కె వాక్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు చాలా మంది పాటించడం లేదని, ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రయాణ సమయంలో చేసే చిన్న పొరపాటు వల్ల మీతోపాటు ఇతరుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌తో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ రమణ, ఎ తేజ, ఎన్ సుబ్బలక్ష్మి, డీఎన్నార్ కళాశాల జాయింట్ సెక్రటరీ రామకృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి, బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లారావు, సీతారామరాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలి



భీమవరంలో వామపక్షపార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర ప్రభుత్వ పేదల వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై టీడీపీ, జనసేన పార్టీలు నోరెత్తకపోవడం దారుణమన్నారు. నిధులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వాసుదేవరావు మాట్లాడుతూ పేదలపై భారాలు మోపే బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు జి రాంబాబు, పట్టణ కార్యదర్శి కె మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు, దుగ్గిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలను అభివృద్ధి చేసుకోవాలి

పెనుగొండ: అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన రంగం వైపు మళ్లి వాటిని అభివృద్ధి చేసుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి సదస్సులో పాల్గొన్నారు. రాబోతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి భావితరాలకు మంచి బాటలు వేయాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ జువాలజీ విభాగ ఆచార్యులు మట్టారెడ్డి జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: గ్రామాల్లో తాగు, సాగు నీటి ఎద్దటి లేకుండా చూడాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది వేసవి దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అలాగే ఆయ కట్టు శివారు ప్రాంతాల వరిసాగుకు సాగు నీరు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు కట్టేస్తే డ్రెయిన్‌లకు క్రాస్ బండ్స్ నిర్మించాలన్నారు. అనంతరం మండలంలో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు, మండల వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, ఎంపీటీసీలు బొమ్మిడి కొండరాజు, తిరుమాని తులసీరావు, మైనపు వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు జల్లా కొండయ్య, ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు, కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి



ధర్నా వాల్‌పోస్టర్స్ విడుదల చేస్తున్న వెంకట్రావు

ఉండి: ఉపాధి హామీ కార్మికులకు ప్రతీ ఏటా 200 రోజుల రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని వేతనం రూ.700 ఇప్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు, మండల నాయకుడు కోనా గొల్లయ్య అన్నారు. శుక్రవారం సీపీఐ మండల కార్యాలయంలో వ్యవసాయ కార్మికులు ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు, గొల్లయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని అన్నారు. ఉపాధిహామీ పనులను మొక్కుబడి కాకుండా ప్రతీ ఏటా తప్పకుండా 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులను యంత్రాలతో చేపట్టడం సిగ్గుచేటని అన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే సమయంలో మరణిస్తే వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సనపల శ్రీనివాస్, మండల కార్యదర్శి తమ్మరాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

90108 51166

Office mail : tpgadvt@gmail.com